నిప్పుకోడి

ఉదయం తొమ్మిదిగంట లయింది. ఎండలో చురుకుపాలు హెచ్చింది.

రామకోటి తన పాతలాల్చీ జేబుల్లో చేతులు పెట్టుకుని నడుస్తున్నాడు. ఎండలో వేడిమి హెచ్చడంతో అత డనుకున్నాడు; 'నా ఆకలిలాగే ఈ ఎండకూ వేరే పనేమీ లేదు....'

ఒక పెద్దహోటలు... రామకోటి ఆకస్మాత్తుగా ఆగిపోయాడు. హోటలు ముందు బోర్డుమీద వ్రాసిఉన్న అక్షరాలను కూడబలుక్కుంటూ చదివాడు. 'ఇచ్చట అన్ని పదార్థములు శుభ్రమైన వెన్నకాచిన నేతితో తయారుచేయబడును...'

రామకోటి క్రింది పెదవిని పళ్ళతో నొక్కుతూ మరొక పోస్టరు వైపు చూశాడు. అందులో యిద్దరు వస్తాదుల బొమ్మలున్నాయి. ఒకడిది గుండు...రెండోవాడి మెడలో ఒక తాయెత్తు వుంది. వాళ్ళిద్దరూ ఛాలెంజీ వస్తాదులు. ఆదివారం సాయంకాలం జరుగబోయే కాటా కుస్తీ పోటీలలో వారిద్దరూ ప్రత్యర్థులు.

'ఇవాళేగా ఆదివారం తప్పకుండా వెళ్ళిచూడాలి...' అనుకున్నాడు రామకోటి.

కాని, యిటువంటి ఇతర ఆలోచనలతో ఆకలిని మరిచిపోదామని అతడు చేసే ప్రయత్నాలు బొత్తిగా ఫలించడంలేదు. ఇప్పుడూ అంతే అయింది. అతని లాల్చీ జేబులో ఎంత వున్నదో అతనికి తెలుసు. అతడు బడ్డీకొట్టు పక్కకు తప్పుకుని జేబులో పైసలన్నీ యివతలికి తీసి లెక్క పెట్టుకున్నాడు. ఎన్నిసార్లు లెక్కపెట్టినా ముప్ఫయి పైసలే... డబ్బులు పిల్లలను పెట్టవుకదా!

అతడు పైసలను గుప్పిటలో వుంచుకుని హోటల్లోకి వెళ్ళాడు. లోపల ఎక్కడా ఖాళీలేదు. జనం తినేవాళ్ళు తింటూవుంటే 'వాళ్లెప్పుడు లేస్తారా' అని కాచుకుని వున్నవాళ్ళూ వున్నారు. అందరి ముఖాలలోనూ ఆకలి...ఆకలి...

అత డొకచోట కూర్చున్నాడు. అతని కెదురుగా యిద్దరు యువకులు కూర్చుని వున్నారు. వారిలో ఒకడు తాళాలగుత్తిని చేతి వ్రేలికి చుట్టుకుని గిరాగిరా తిప్పుతున్నాడు. రెండో, యువకుడు ఉండి ఉండి ముఖం తుడుచుకుంటున్నాడు. ఉన్నట్టుండి మొదటి యువకుడు ఒక విట్టు వేశాడు. రెండో యువకుడు నవ్వాడు. ఒక్కక్షణం తర్వాత మొదటి యువకుడు ఏమీ తోచనివాడిలా జేబులోనుంచి పర్సు తీసి డబ్బు లెక్క పెట్టడం ప్రారంభించాడు. అయిదు పదిరూపాయలనోట్లూ, ఒక అయిదు రూపాయలనోటూ... రెండో యువకుడు "మొన్ననే కదురా యింటినుంచి మనియార్డరు వచ్చింది? మిగిలిదంతా ఏంచేశావు?' అని అడిగాడు. మొదటి యువకుడు నవ్వాడే కాని ఏమీ బదులు చెప్పలేదు.

యాభై అయిదు రూపాయలు! ఇరవై రోజుల క్రిందట రామకోటి చేతికి వూళ్ళో మార్వాడీ సరిగ్గా అంతే మొత్తం యిచ్చాడు. అతని చేతి మీదుగా చెల్లిపోయిన చివరి మెడలు అది...ఎన్నోయేళ్ళ క్రిందట విజయనగరంలో జరిగిన పోటీలలో నాలుగోవాడిగా వచ్చినందుకు తనకు లభించిన మెడలు అది. మొదట్లో దాన్ని తానెంత ప్రాణప్రదంగా చూసుకునేవాడు! ఇప్పటికి అన్నిటివలెనే దానికీ కాళ్ళు వచ్చాయి.

సర్వరు వచ్చి నీళ్ళగ్లాసులు చప్పుడు చేస్తూ బల్లమీద వుంచి 'ఏం కావాలి' అని అగాడు.

మొదటి యువకుడు 'నాకు చాలా ఆకలిగా వుంది. రాత్రికూడా ఏమీ తినలేదు...' అంటూ ఏవో రెండు పదార్థాలు తెమ్మన్నాడు.

రామకోటి రెండు వ్రేళ్ళు చూపించి 'ఇడ్లీ' అన్నాడు.

'రెండిడ్లీలు!' అసలే పూతరేకుల్లా గాలి వేస్తే ఎగిరిపోయేట్టు వుంటాయవి. లోపల ఆకలి మాత్రం విపరీతంగా చెలరేగుతున్నది.

రెండిడ్లీలు ఏ మూలకు? అతడు చాలా ఏళ్ళక్రిందట నెల్లూరులో కాటా కుస్తీలలో పాల్గొనేందుకు వెళ్ళి ఒకానొక సందర్భంలో పందెం కట్టి నాలుగుడజనుల అరటి పళ్ళు తిన్న విషయం గుర్తుకు వచ్చింది.

అ శక్తి, ఉత్సాహమూ తగ్గిపోయి అన్నీ ఉడిగిపోయినా అతని ఆకలి మాత్రం తగ్గలేదు. సరికదా తన దారిద్ర్యంతోపాటు, వయస్సుతో పాటు అదికూడా పెరుగుతూ వచ్చింది.

అనుకున్నంతా అయింది. ఈ రెండిడ్లీలూ క్షణంలో నోట్లో కరిగి పోయాయి. ఇరవై పైసలూ అయిపోయింది. పైగా దీనిమూలంగా సుప్త క్షుదాగ్ని జ్వాలలు మరింత విజృంభించాయి. మరొక ఇడ్లీ తెమ్మనిచెప్పి అతడు దిగులుగా కూర్చున్నాడు. పైసల నొక చేతిలోనుంచి మరొక చేతిలోకి మార్చుకుని నుదురు పట్టుకుని కూర్చుండిపోయాడు.

ఎదుటి యువకులలో మొదటి వాడు చెయ్యి కడుక్కునివచ్చి రెండో అతనితో 'అమ్మ బాబోయ్! నేనిక ఏమీ తినలేను. నాకేమీ వొద్దు. అంటున్నాడు.

రామకోటి అప్రయత్నంగా 'అదేమిటి బాబూ! ఇందాక ఆకలిగా వుందంటివే. ఇదేనా నీఆకలి! నీ వయస్సులో నేను ఎంత తిండి తినే వాణ్ణి! ఇప్పుడీ హోటళ్ళలో డబ్బు లెక్క తప్ప తిండి లెక్కేమున్నది! రూపాయలు అయిపోవడం తప్ప కడుపు నిండుతుందా ఏమన్నానా?' అన్నాడు.

ఆ యువకు లిద్దరూ రామకోటి చొరవకు ముందు ఆశ్చర్యపోయి నట్టున్నారు. తరువాత అ యువకుల పెదవులమీద దరహాసం చూసిన రామకోటి మళ్లీ 'అవునండీ! మీ వయస్సులో నాకెంత తిండిపుష్టి వుండేది! నా కిప్పుడు అరవైయేళ్లు నిండాయి. ఇప్పటికీ ఉన్నపాటున నలభై జతల ఇడ్లీలు తినగలను...' అన్నాడు.

మొదటి యువకుడు గడుసువాడు. అతడు నవ్వి 'సరే...ఇప్పుడు నలభై ప్లేట్ల ఇడ్లీలు తినండి... పందెం...ఏమీలేదు. మీరు గెలిస్తే ఆ బిల్లు నేనే చెల్లిస్తాను. మీరు ఓడిపోతే...అంటే నలభై ప్లేట్లూ ఖాళీచెయ్యలేక

పోతే_నేను నయాపైసాకూడా యివ్వను. అప్పుడాబిల్లు మీరిచ్చుకోవల సిందే... సరేనా?" అన్నాడు. రెండో యువకుడు ఇందాక తాను మిత్రుణ్ణి అడిగిన ప్రశ్నకు సమాధానం తెలిసినవాడిలా ముఖం పెట్టాడు. అతనికీ హుషారు హెచ్చింది. రామకోటివంక నిశితంగా చూశాడు. మెడ మీద చిరుగుపట్టిన పాత లాల్చీ, అడ్డకట్టు లుంగీ, లావుపాటి బెల్టూ, బుంగ మీసాలూ అతని దృష్టినాకర్షించాయి.

రామకోటి కళ్ళు మెరిశాయి... తలవూపి "సరే" అన్నాడు. ఈ వ్యవహారం చుట్టుప్రక్కల వారినికూడా ఆకర్షించింది. అప్పటికే జనం ఆ బల్లచుట్టూ చేరడం ప్రారంభించారు.

సర్వరు పెద్ద ట్రేలో ఇడ్లీప్లేట్లు పట్టుకువచ్చి బల్లనిండా పరిచాడు. అటూ ఇటూ తిరుగుతూవుండే హోటల్ సూపర్‌వైజరు...పచ్చని వాడొకడు_"అక్కడ జనం మూగివున్నారేమిటా? అని చూడవచ్చి తానూ అక్కడే నిలబడిపోయాడు.

రామకోటి నవ్వుతూ అంతటినీ తేలికగా తీసుకున్నాడు. తర్వాత త్వరత్వరగా తినడం ప్రారంభించాడు. చుట్టూ చేరిన జనం కళ్ళు పెద్దవి చేసుకుని ఉత్కంఠతో చూస్తూవుండగా అతడు వెంటవెంటనే ప్లేట్లు ఖాళీ చెయ్యడం ప్రారంభించాడు.

క్రమంగా చుట్టూ జనం ఎక్కువయినారు. కొత్తగా వచ్చిన వాళ్ళు అక్కడ అంతకుముందు నిలబడి వున్నవారిని "ఏమిటది?" అని ప్రశ్నిస్తున్నారు.

"ఆ మీసాల ముసలాయన నలభై జతల ఇడ్లీలు తింటానని పందెం కాశాడు"

"పందెం ఎంత?"

"వేరే పందెం ఏమీలేదు. ముసలాయన అన్నీ తినగలిగితే ఆ బిల్లు అవతలివాళ్ళు చెల్లించేట్టు...తినలేకపోతే ఆయనే యిచ్చుకునేట్టు..."

"నలభై జతల ఇడ్లీలతో పందెమా? నా చిన్నతనంలో వంద రూపాయల పందెంకట్టి ఒక అరటిపళ్ళగెల అంతా తిన్నాడొకడు"

"నిజమే. ఈ మాత్రపు దానికి పందెం ఎందుకు ? ఈ తిండి మామూలుగా తినేవాళ్ళు కరవదిలో లెక్కలేనంతమంది ఉన్నారు. రెండు రోజులు ఉపవాసంచేస్తే మనమూ తినవచ్చు.

"భలేవాడివే...నువ్వా తినేది ? డోకులూ విరేచనాలు పట్టుకుని 'ఢామ్మ'ని ఛస్తావు..."

"గామా ఒకసారి మొత్తం మేకనే తినేశాట్ట..."

"ఇప్పుడింతకీ ఈ ముసలాయన మొత్తం తినగలడంటావా ?"

"చూస్తాంగా..."

మొత్తం ముప్పయి ఖాళీప్లేట్లు లెక్కకొచ్చాయి. మళ్ళీ సర్వరు పదిప్లేట్లు తెచ్చిపెట్టాడు. రామకోటి ఆ కొద్దిక్షణాల విరామంలో మీసాలు తుడుచుకున్నాడు. అంతలోనే అతనిముందు పదిప్లేట్లూ కనిపించాయి. అతనికి లోపల కొంచెంగా దడ బయలుదేరింది. ఇప్పటికే కడుపు పూర్తిగా నిండిపోయింది. నీళ్లు తాగితే ఖాళీ వస్తుందేమో ! అయినా ఎక్కువ నీళ్ళు తాగకూడదు. అప్పుడు వ్యవహారం మొత్తం అడ్డం తిరుగుతుంది. అందువల్ల ఒక్క గుక్కెడు నీళ్ళుతాగాడు. కొంచెం ఫరవా లేదనిపించింది. మరోప్లేటు ముందుకు లాక్కున్నాడు.

ఆ యువకుడు చేతి చూపుడు వ్రేలితో తాళంచెవులగుత్తిని గిర గిరా తిప్పుతూ అలాగే కూర్చున్నాడు. అతని తీక్షణమైన చూపులకు రామకోటి కళ్ళలో ఆదుర్దా తెలిసే వుండాలి. అందువల్లనే అతని పెదవులమీద చిరునవ్వు ఉదయించింది. రెండో యువకుడు జేబురుమాలతో ముఖం మాటిమాటికీ తుడుచుకుంటూ అలాగే కూర్చున్నాడు.

"ఇంకెన్ని ఉన్నాయి" అని అడిగారెవరో జనంలోనుంచి.

"అయిదు జతలు..." అని సమాధానం వినవచ్చింది.

రామకోటి కళ్ళకు ఆ చివరి పది ఇడ్లీలూ పెద్దపెద్ద కుడుముల్లాగా, దిబ్బరొట్టెల్లాగా కనిపిస్తున్నాయి. అయినా ఈ హోటళ్ళవాళ్ళు యింతంత పెద్ద ఇడ్లీలు వేస్తారెందుకో ! వీటినే తా నింతకు ముందు పూత రేకుల్లా, గాలి విసురుకు ఎగిరిపోయేలా వున్నాయని భ్రమపడ్డాడు. అతని

మనస్సులో భయం బయలుదేరింది. కళ్ళు మూసుకునితింటూనేమనసులో లెక్కవేసుకున్నాడు. తాను ఓడిపోతే ఎంత యివ్వవలసి వస్తుందో ఆలోచించాడు...అంతలో అతని గుండెలు దడదడలాడాయి. జరగబోయేది తలుచుకుంటే నిలువెల్లా వొణుకు పుట్టుకుని వస్తున్నది. తాను ఓడిపోతే దాదాపు ముప్ఫయి ఎనిమిది ప్లేట్ల ఇడ్డీలకు సొమ్ము చెల్లించవలసివస్తుంది. తన దగ్గరున్నవి ముప్ఫయి పైసలు...తాను బయట పడిపోవలసివస్తుంది. నలుగురిలోనూ తలవంపులు...అవమానం... అందరూ తనను అసహ్యంతో దొంగను చూసినట్టు, మోసగాణ్ణి చూసినట్టు చూస్తారు. ఒకవేళ తాను ప్రాధేయపడి అడిగినా ఆ క్రూరవాడు ససేమిరా వీల్లేదంటే?... హోటలువాడూరుకుంటాడా? ఇటువంటి సందర్భాలలో చొక్కాలు విప్పించి తీసుకుని పంపిస్తారని తాను విన్నాడు. లేకపోతే తనను లోపల రెండు రోజులపాటు చాకిరీ చెయ్యమనవచ్చు. ఇంత బ్రతుకూ బ్రతికి ఇంత అవమానమా? ఇంత జరిగాక తనకు ఆత్మహత్యతప్ప వేరే శరణ్యం లేదు...

"ఇంక ఒక్క ప్లేటే మిగిలింది" అంటున్నారెవరో...అది విని కళ్ళుతెరిచి చూశాడు రామకోటి. అంతలో అతనికి కొండంత బలం వచ్చింది. ప్రక్కన నీళ్ళగ్లాసు అందుకుని అరగుక్కెడు మాత్రమే నీళ్లు త్రాగి ఆ చివరి ప్లేటు ముందుకు లాక్కున్నాడు.

"బస్...గెల్చాడు ముసలాయన...గట్టివాడే....అన్నారెవరో...

రామకోటి చివరిప్లేటు దూరంగా తోసేసి మళ్ళీ కొంచెం నీళ్ళు తాగాడు. తర్వాత చేత్తో గొంతు సర్దుకున్నాడు....జనంలో కలకలం... హోటల్ సూపర్‌వైజరు నవ్వుకుంటూ క్లీనర్లను పిలిచి "రేయ్...ప్లేట్లు తీసేయండి....ఊ..." అంటూ హడావిడిచేశాడు. చుట్టూ మూగిన జనం నవ్వుకుంటూ ఎవరి సీట్లలోకి వారు వెళ్ళిపోయారు.

ఆ యువకులిద్దరూ లేచారు. రామకోటికి చేయి అందించాడు మొదటి యువకుడు. రామకోటిలేచి వారివెంట యివతలికి వచ్చాడు. ఆ యువకుడు బిల్లు చెల్లించి బయటికివచ్చి నవ్వుతూ రామకోటి వంక చూశాడు.

రామకోటికి అకస్మాత్తుగా దుఃఖం పొంగివచ్చింది. అతి బలంగా ప్రయత్నించినా కళ్ళలో నీటిపొరను ఆపలేకపోయాడు. అప్రయత్నంగా చేతులు రెండూ జోడించాడు.

వారిద్దరూ వెళ్ళిపోయారు. రామకోటి వారిద్దరూ కనుచూపు మేర దాటిపోయేవరకూ చూసి నిట్టూర్చి వెనుదిరిగాడు. ఆ యువకుడి ముఖం... అతని కళ్ళలోని కాంతి... అతని చిరునవ్వూ రామకోటికి మాటి మాటికి గుర్తు వచ్చాయి.

* * *

కొంచెందూరం నడవగానే అతడు బాగా స్థిమితపడ్డాడు. ఒకబడ్డీ కొట్టుముందు ఆగి పది పైసల బీడీలు కొనుక్కున్నాడు. ప్రక్కనున్న తాటితో ఒక బీడీ అంటించుకుని మిగిలిన వాటిని జేబులో వేసుకుని నెమ్మదిగా పొగ వొదులుతూ యివతలికి రాబోతూవుండగా ఆ బడ్డీకొట్టువాడు అతన్నిచూసి నవ్వి "నేను గుర్తున్నానా ?" అని అడిగాడు.

రామకోటి కళ్లు పెద్దవి చేసుకుని చూశాడు. ఆ కొట్టుమీద వ్యక్తికి పాతిక సంవత్సరాలుంటాయి. పెద్ద పెద్దకళ్లు... పచ్చని మనిషి,.. ఉంగరాల జుట్టు... సన్నగా పొడుగ్గా వున్నాడు. "నన్నింకా గుర్తుపట్టలేదా ?" అన్నట్టు నవ్వుతున్నాడు.

"నేను మౌలానా కొడుకుని..." అన్నాడతడు చివరకు...

రామకోటి అతని సమీపంలోకివెళ్ళి "మౌలానా కొడుకువా? గుర్తుపట్టలేకపోయాను సుమా? నీ పేరు ఇస్మాయిల్ కదూ? అన్నట్టు మీ నాన్నను చూసి చాలా రోజులైంది...బాగున్నాడా?" అన్నాడు.

ఇస్మాయిల్ దిగులుగా నవ్వుతూ "మీకు తెలీదేమో! మా నాన్న ఆరేళ్ళక్రితమే పోయాడు..." అని చెప్పాడు.

రామకోటి నివ్వెరపోయాడు. అతని కళ్ళముందు మౌలానా నిలబడినట్టయింది. తనకంటే చిన్నవాడు...మనిషి ఎట్లావుండేవాడు! కండలు తిరిగిన పచ్చని శరీరమూ, నున్నని గుండూ, మెడలో పులిగోరూ...

లంగోటాకట్టి తొడచరిచి గోదాలోకి దిగితే పెద్దపెద్ద వస్తాదులకు కూడా గుండెలు దడదడ లాడేవి... పెద్దలు సంపాయించిన ఆస్తి వుండేదేమో, మంచి తిండి తినేవాడు. నిరంతరం పదిమందినీచేర్చి వాళ్ళకి వ్యాయామమూ, కుస్తీలు, పట్లూ పద్ధతులూ నేర్పుతూ వుండేవాడు. కావలిలోనో ఒంగోలులోనో ఒకసారి తమ యిద్దరికీ పోటీ పడింది. ఆ నాడు జనం విరగబడిపోయారు. కుస్తీ జరిగినంతసేపూ జనంలోనుంచి ఒకటేగోల... చప్పట్లూ...ఈలలూ...ఆ నాడు తాను అతనిమీద గెలుపు సాధించినప్పటికీ అది గెలుపు అని తానెన్నడూ అనుకోలేదు.

ఇస్మాయిల్ ఎవరికో కిళ్ళీ చుట్టియిస్తూ చెప్పాడు. "అప్పటికే ఖర్చు ఎక్కువయిపోయింది. ఇల్లేమో తాకట్టులోవుంది. అవతలివాళ్ళు కోర్టులో వ్యాజ్యంవేసి గెల్చి యిల్లుకొట్టేయించుకున్నారు. మేమంతా చిన్నపిల్లలం; ఇదుగో...ఇప్పటికి నేనీమాత్రంగా నిలదొక్కుకున్నాను. చెల్లెలి పెళ్ళి చేశాను. తమ్ముడు మీకు గుర్తున్నాడోలేదో, ఒకసారి మీరు మా ఇంటికి వస్తే "మామా మామా"అంటూ వెంటబడ్డాడు. వాడిప్పుడు రైల్వేషెడ్డులో పనిచేస్తున్నాడు..."

రామకోటి ప్రతిమవలె నిలబడి విన్నాడు. తర్వాత ఉన్నట్టుండి "ఆ రోజులేవేరు. ఇప్పుడాహుషారేలేదు, అంతా కుర్రవాళ్ళు చేరారు... ఇవాళ క్లబ్బు గ్రౌండులో కుస్తీ జరుగుతుందని చూశానే ఎక్కడో... వెళ్ళాలనేవుంది... మరి టిక్కెట్టు ఎంతో, ఏమిటో..." అన్నాడు.

ఇస్మాయిల్ జేబులోనుంచి టిక్కెట్టుతీసి "ఇదిగో నా దగ్గర టిక్కెట్టుకూడావుంది. కావలిస్తే యిది తీసుకోండి...నేను విడిగా వస్తాను. అక్కడ అంతా నాకు తెలిసినవాళ్ళే..." అన్నాడు.

రామకోటి ఆ టిక్కెట్టు అందుకుని జేబులో వుంచుకుని నవ్వి "నీకూ వుందన్నమాట ఈ పిచ్చి..." అన్నాడు.

"ఆ వాసన పోదుగా. మా అమ్మకు ఈ కుస్తీలంటే వొళ్ళుమంట. నేనయినా ఆమెకు తెలీకుండా వెళ్ళడమే... "ఆలస్యంగా వచ్చావేంరా?" అని అడిగితే "సినిమాకు వెళ్ళివచ్చాన"ని అబద్ధమాడుతూ వుంటాను ఆమెకు తెలిస్తే గొడవచేస్తుంది..." అన్నాడు ఇస్మాయిల్.

"అయితే వెళ్ళొస్తాను..." అన్నాడు రామకోటి నడక సాగిస్తూ.

అతనికిప్పుడు హాయిగావుంది. కూనిరాగంతీస్తూ బీడీ చివరిదమ్ము పీల్చి విసిరి అవతల పడేసి త్వరత్వరగా నడిచాడు. అప్పటికి ఎండలో బాగా వేడిమి హెచ్చినా అతనికి అట్టే బాధాకరంగాలేదు.

• * *

ఆ యింటి యజమాని మంచివాడు. ఇంటిమీదవచ్చే అద్దెలతోనే కాలంవెళ్ళబుచ్చవలసి వున్నప్పటికీ, ఆయన అద్దెలు విపరీతంగా పెంచ లేదు. ఆయనకు ముందూ వెనకా ఎవరూ లేరు. ఆ పెద్ద పెంకుటిల్లు పెద్దలు సంపాయించి యిచ్చినది. రిటైరయిన తర్వాత వచ్చే ఆ నాలుగు రాళ్ళతోనూ, యీ అద్దె డబ్బుతోనూ కాలక్షేపం చేస్తున్నాడు. రామకోటి ఆ యింటిలో ఒక చిన్న గదిలో చాలా యేళ్ళనుంచీ వుంటున్నాడు. గది మధ్యలో ఒక తడికె అడ్డం పెట్టుకుని ఒక భాగం పడక గదిగా రెండో భాగం వంట గదిగా ఉపయోగించుకుంటూ కాలం గడుపుతున్నాడు. ఇరవై రోజుల క్రిందట తన మెడల్ అమ్ముకున్న తర్వాత యింటిఅద్దె నాలుగు రూపాయలు చొప్పున తాను బాకీపడిన నాలుగు నెలల అద్దె చెల్లించివేశాడు.

ఆ గదిలో ఒక ఫొటో వుంది. అది రామకోటిని చిన్నతనంనుంచీ అభిమానించి ఆదరించిన రాజాగారిది. ఆయన ఆరునెలల క్రిందట హఠాత్తుగా గుండెఆగి చనిపోయాడు, అంతవరకూ ఆయన రామకోటికి ప్రతి నెలా ఎనభై రూపాయల వంతున పంపుతూ వుండేవాడు. అందుకే రామకోటి ఎన్నడూ ఏ ఉద్యోగం కోసమూ ప్రయత్నించకుండా యిన్నాళ్ళూ హాయిగా కాలం గడిపాడు. ఇప్పుడు రాజాగారి కొడుకులు వేరుపడి తమను చూసేందుకు వచ్చిన రామకోటిని గమనించనేలేదు. పైగా నిరసించారు కూడా. వారి ప్రవర్తన, వారికి రామకోటికి పైసా కూడా యివ్వరని చెప్పక చెప్పింది. అతడు వారితో మాట్లాడక తిరిగి వచ్చేశాడు.

అతడు తలుపు తెరిచి లోపలికి ప్రవేశించి పైనున్న తుండూ, లాల్చీ తీసి తడికె మీదికి విసిరి, నడుముకున్న తోలుబెల్టుతీసి దూరంగా

పడేసి కుక్కిమంచంలో కూలబడ్డాడు. పక్క వాటాలో అద్దెకున్న మునిసిపల్ ఆఫీసు ప్యూను కూతురు — అయిదేళ్ళ పిల్ల — పరుగెత్తుకు వచ్చింది. ఆ పిల్ల పేరు స్వరాజ్యం.... దాని పొట్టనిండా ప్రశ్నలే.... ఇంట్లో తల్లిని అడిగితే విసుక్కుంటుంది. అందువల్ల ఆ పిల్ల తనకు ఏ అనుమానం వచ్చినా రామకోటి దగ్గరికిచేరి వొళ్లో కూర్చుని తీరికగా సంభాషణ ప్రారంభిస్తుంది.

అవాళ ఆ పిల్ల వచ్చీరాగానే "తాతా! మా అన్నయ్యకేమీ తెలీదు. వాడు బడికెళ్లేటప్పుడు ఒకమాట అడిగాను. చెప్పలేకపోయాడు. పైగా కసురుకున్నాడు" అన్నది వొళ్లో కూర్చుంటూ.

రామకోటి నవ్వి "ఏమిటది?" అని అడిగాడు.

"మరేమో, వాళ్ళ మనో లేదూ ...అదే మనోరమ....అది చెప్పింది కదా, నిప్పుకోడి వుంటుందే. అది నిప్పులు తింటుందిట.... నిజమేనా మరి?...."

"ఏమో, నాకు తెలీదు...." అన్నాడు రామకోటి. స్వరాజ్యం అదోక రకంగా మొహం పెట్టి "నీకూ తెలీదూ?" అని వూరుకుంది.

రామకోటి ఆలోచనలో పడ్డాడు. అవును. నిప్పుకోడి అనే పేరు దానికెందుకు వచ్చిందో! నిజంగా నిప్పులు తింటుందేమో! లేకపోతే దానికీ తనలాగే ఆకలి ఎక్కువై ఏదిపడితే అది తింటుందేమో! పావురాళ్లు రాళ్ళను తినవూ? అలాగేనేమో!

స్వరాజ్యం ఊరుకోలేదు. "నిప్పులు తింటే గొంతు కాలిపోదూ? ఆ మనో ఎప్పుడూ యింతే.... అన్నీ అబద్ధాలు చెపుతూ వుంటుంది. పైగా వాళ్ళ అన్నయ్య చెప్పాడంటుంది.... వాళ్ళ అన్నయ్య పెద్ద పెద్ద పుస్తకాలు చదువుతూ వుంటాడు" అన్నది.

రామకోటి ఆ పిల్ల వెళ్ళిపోయిన తర్వాత మంచంలో కాళ్లు జాపుకుని పడుకున్నాడు. అతని కెదురుగా గుమ్మంలోనుంచి చూస్తే పెద్ద వేపచెట్టు కనిపిస్తుంది. దాన్కింద ప్రొద్దుటినుంచీ ఎవరో కొలిమి పెట్టి

గిన్నెలకు మాట్లువేస్తూ కళాయివేస్తూ పాటుపడుతున్నారు. పదేళ్ళ బక్కచిక్కిన కుర్రవాడొకడు ఆయాసంతో ఒగర్చుతూ తిత్తి వొత్తుతున్నాడు.

పక్క భాగంలో ఎవరో పేపరు పెద్దగా చదువుతున్నారు. "బీహారులో క్షామం... ప్రజలు తిండిలేక పడుతున్న ఇక్కట్లకు లెక్కలేదు. బావులలో నీటిచుక్కలేదు... మా విలేఖరి... భూమి నెర్రెలువిచ్చి భయంకరంగావుంది.. ప్రధాని పర్యటన...ప్రజలు ఆకలిగొన్న ముఖాలతో చుట్టుముట్టి తమ ఇబ్బందులు చెప్పుకున్నారు. ప్రధాని కళ్ళలో నీరుతిరిగింది... క్షామప్రాంతంలో ఒక వృద్ధురాలితో సంభాషిస్తున్న దృశ్యం."

నెర్రెలువిచ్చిన భూమిని రామకోటి ఒకసారెప్పుడో చాలాయేళ్ళ క్రిందటచూశాడు. అదేదో, ఒంగోలుకు దూరంగా వున్న వూరు.... మండు వేసవి....అసలే కరువుకాటకాలకు ఆ ప్రదేశం శాశ్వత స్థావరం. అతడు చనిపోయిన దున్నపోతు నొకదాన్ని చూశాడు. దాని నోరు భయంకరంగా తెరుచుకునివుంది. అటువంటి పగుళ్ళు నేల అంతా.... ధరిత్రి అంతా వేయినోళ్ళతో "దాహం దాహం" అంటున్నట్టు.... మూర్ఛవాడు నీటికోసం నోరు తెరిచినట్టు....

రామకోటి బలవంతంగా ఆలోచనలు మళ్ళించుకున్నాడు. అతని మంచం పక్కనే తడికెమీద చాలా పాతపేపర్లు అంటించాడు. అవన్నీ చాలా ఏళ్ళ క్రిందటివి ... మద్రాసులో పెద్ద ఎత్తున జరిగిన కుస్తీ పోటీలకు సంబంధించిన బొమ్మలు....రామకోటి అతి శ్రద్ధగా వాటిని తడికెమీద అంటించాడు.

బొమ్మలో చిన్న సైజు కొండలా వున్నాడు కింగ్‌కాంగ్.... అతని సన్ననితలా, పెద్ద శరీరమూ, ఆ చూపులూ తలుచుకుంటేనే అద్భుతంగా వుంటాయి.

మకుటంలేని మహారాజుగా చెలామణీ అవుతున్న కింగ్‌కాంగ్‌కు ఎదురునిల్చి 'సెబాష్' అనిపించుకున్నవాడు దారాసింగ్. భుజాల మీద గుడ్డ కప్పుకునివుండి బొమ్మలో చిరునవ్వు నవ్వుతున్నాడు. భారతదేశపు కుస్తీకి స్వర్ణయుగం మళ్ళీ వచ్చిందనిపించాడు. సరిసమానంగా ఏపుగా

పెరిగిన కండలు తిరిగిన శరీరం. ఆకర్షణీయమైన ముఖం. చక్కని క్రాపూ.... కుస్తీలో ఒడుపూ వేగమూ. యితని ప్రత్యేకతలు.

ఆ పక్కనే బొమ్మలో వున్నవాడు రష్యన్ భల్లూకం. అతన్ని తలుచుకుంటేనే హడల్ పుడుతుంది. అతనికాపేరు ఎలా వచ్చిందోగాని నిజంగా అతనిది భల్లూకపుపట్టే. పెద్దపెద్ద అంతర్జాతీయ వస్తాదులు కూడా మద్రాసులో అతని భల్లూకపు పట్టులో చిక్కి జవజవలాడి నీరు కారి పోయారు.

ఇంకా చాలామంది వున్నారు కాని వారందరి ఫొటోలూ అతడు సేకరించలేకపోయాడు. అప్పుడు మద్రాసులో ఎంత హడావిడి ...ఎక్కడెక్కడి మహా వస్తాదులూ ఒక్కసారిగా రావటంతో గొప్ప అలజడి... జనం వేలకువేలు విరగబడిపోయారు. నగరంలో ఎక్కడ చూసినా అవే చర్చలూ.... వాగ్వాదాలూ....

రామకోటికి నిద్రపట్టింది. అతనికి సాధారణంగా కుస్తీలను గురించి కలలు కనటమంటే గొప్ప యిష్టం. అటువంటి కలలు వచ్చిన నాడు అతనికి చాలా హుషారుగా వుంటుంది. కాని యిటీవల చాలా రోజులుగా అతనికి కుస్తీలను గురించిన కలలు రావడంలేదు. ఎప్పుడూ కలల్లో పాములే కనిపిస్తున్నాయి. నిద్ర పట్టగానే మొదలు... రకరకాల పాములు... రకరకాల రంగులలో...లెక్కలేనన్ని కనిపిస్తాయి. ఒకసారి అయిదు తలల పాము కూడా కలలో కనిపించిందతనికి... ఇది విన్న ఒకాయన దాని ఫలితం చెప్పాడు. కలలోకి పాములు రావడం మృత్యుసూచనట... 'సరేలే, ఎందుకింకా బతకడం? బోలెడు జీవితం అయిపోయింది. ఇక ఈ స్థితిలో అనాయాసంగా చావడం కంటె మరేం కావాలి?' అనిపించిందతనికి.

అతనికి యిష్టమైన కల మరొకటి వుంది. అతడు బాగా యవ్వనంలో వుండగా ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి బంగారపు బొమ్మలా వుండేది. ఆమెను మొదటిసారి చూచినప్పుడు రామకోటికి మతి చెడింది. ఆమె నవ్వూ... ఆ కళ్ళలోని కాంతీ... అంత గొప్పవి. ఆమెను కేవలం చూస్తూ అతడు కొన్ని నెలలు గడిపాడు.

ఒక్క మాట లేదు, పలుకులేదు ... నవ్వులు విసరడంలేదు.... సైగలు చేయడం లేదు. పోనీ బుద్ధిగా పెద్దవారితో సంప్రదించడమూ లేదు. ఆమెకు ఉన్నట్టుండి ఎక్కడో సంబంధం కుదిరిందన్నారు. వెంటనే పెళ్ళి అయిపోయింది. పెళ్ళికి అతడు కూడా వెళ్ళాడు. దూరంగా నిలబడి చూసి నాలుగు అక్షింతలు వేసి మరీ వచ్చాడు. చిరునవ్వులు చిందే అప్పటి ఆమె ముఖం అతనికి అప్పుడప్పుడు కలలోకి వస్తూ వుంటుంది. ఆ రోజున అంతా అతడు పసివాడైపోతాడు. ఆ గదిలోనుంచి ఆనాడు వినిపించే పాటలకూ, కూనిరాగాలకూ, ఈల పాటలకూ అంతే వుండదు.

* * *

ఆ సాయంకాలం...

రామకోటి జేబులో టిక్కెట్టు భద్రంగా వుంచుకుని బయలుదేరాడు మధ్యాహ్నమంతా నిద్రపోవటంవల్ల వొళ్ళంతా హాయిగా తేలికగావుంది. పైగా చాలాఏళ్ళ తర్వాత అటువంటి కార్యక్రమానికి హాజరవుతున్నాడు తాను. ఇటీవల వూళ్ళో ఎవరూ ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయ లేదు.

అతడు హుషారుగా అడుగులువేస్తూ చురుకుగా నడిచాడు. విశాల మైన ఆవరణలో ప్రత్యేకంగా కుస్తీలకోసం ఏర్పాటు చేశారు. లోపలికి వెళ్ళేముందు ద్వారానికి అటూఇటూ పెద్దపెద్ద బొమ్మలున్నాయి. లోపల చాలా హడావిడిగా వుంది. రకరకాల తరగతుల టిక్కెట్లు కొనివచ్చిన జనం తమతమ స్థానాలలో కూర్చుని రొద చేస్తున్నారు. పలుచని లాల్చీల వారూ, మెడలలో పులిగోరులు ధరించినవారూ, బుంగమీసాలవారూ, కొందరు నిర్వాహకులూ, అటూ ఇటూ తిరుగుతున్నారు.

రామకోటి గ్యాలరీలో కూర్చుని చేత్తో మీసాలు సర్దుకుంటూ చుట్టూ చూశాడు. అతనికి గర్వం కలిగింది. ఈ జనంఅంతా కుస్తీలమీద' వ్యాయామకళమీద అభిమానం వున్నవారే అనిపించిందతనికి. ఇంత మంది డబ్బు పెట్టి టిక్కెట్లు కొని ఈ తరహా పోటీలను ఇంకా ప్రోత్స

హించడం అతనికి ఆనందం కలిగించింది. 'మనమూ ఒక ఛాన్సు తీసుకుందామా !' అని కూడా అనుకున్నాడు.

కొంతసేపు నిరీక్షణ తర్వాత జనంలో గోల బయలుదేరింది. ఇద్దరు వస్తాదులు గోదాలోకి దిగారు. వారిద్దరిలో ఒకడు పొట్టిగా లావుగా వున్నాడు. తల చాలా చిన్నది. రెండోవాడు పొడగరి. ఒడుపు వున్నవాడు.. సన్నగా వున్నాడు. వారిద్దరూ గోదాలోకి దిగి ఒకరితో ఒకరు తలపడగానే ఇద్దరి శరీరాలూ పొంగాయి.

ఉండిఉండి జనంలో గోలా అరుపులూ ఎక్కువవుతున్నాయి. ఆనందించదగిన క్షణం వచ్చినప్పుడల్లా జనంలో ఉత్సాహం సముద్రపు హోరులా పెచ్చు పెరిగిపోతున్నది.

రామకోటి పక్కన ఉన్నవారు చాలామంది లావుపాటి వాడిపక్షం వాడు విజృంభించినప్పుడల్లా వారు పెద్దగా కేకలు పెడుతున్నారు. రామకోటికి వాడిలో మూర్ఖపు చొరవ తప్ప మరేమీ కనిపించలేదు. రెండో వాడే కొంచెం నయం..తప్పుకోడం, వీలుచూసుకుని వేగంగా ముందుకు దూకడంవంటి మంచి లక్షణాలు కొన్ని వాడిదగ్గర ఉన్నాయి.

రామకోటికి ఎడమప్రక్కన నడివయసు మనిషి ఒకడు ప్రశాంతంగా కూర్చుని చూస్తున్నాడు. రామకోటి అతనితో పోటీ జాగానే వుంది కాని, వీళ్ళు మరీ సగటు వస్తాదులు కూడా కారండీ.... బొత్తిగా మామూలు రకం.... అయినా ఫరవాలేదు ...' అన్నాడు.

ఆ మనిషి రామకోటి వంక చూసి 'ఏదో....మామూలు కుస్తీలే.... అయినా యివికూడా రాను రాను క్రమంగా తగ్గిపోతున్నాయి. మునుపు నేను చాలా చూశాను. చాలా వూళ్ళలో చూశాను. అ హుషారే లేదిప్పుడు ....ఏదో అభిమానంకొద్దీ రావడం తప్పితే....' అంటూ ఆగి అకస్మాత్తుగా అతన్ని గుర్తుపట్టినట్టు నవ్వి 'మిమ్మల్ని చాలాసార్లు చూశాను. విజయ నగరంలో మొదటిసారి ... నాకు బాగా గుర్తు ... మీరు నాలుగో వాడుగా వచ్చారు.. ఒక మెడల్ యిచ్చారు మీకు...' అన్నాడు.

రామకోటి 'అవునవును....' అన్నాడు. అతని కళ్ళవెంట ఆనందా

శ్రువులు ఉబికి వచ్చాయి. అప్రయత్నంగా పైగుడ్డతో కళ్లు అద్దుకున్నాడు. తాను ఇరవై రోజుల క్రిందట అమ్ముకున్న ఆ ముచ్చటైన మెడల్ కళ్ళలో మెదిలింది.

'మద్రాసులో పోటీలు కూడా చూశాను. కుస్తీలంటే అవి.... ఒక్కొక్కడూ జగజ్జెట్టీ ...కన్నులపండువుగా వుంది కదండీ .. అయినా యిక యిప్పుడీ కుస్తీలూ, గట్రా క్రమంగా తగ్గిపోతున్నాయి లెండి.... తెలవారి లేస్తే అందరూ పొదుపు పొదుపు అంటున్నారు. మామూలుగా తినే వాళ్ళకే తిండి సరిగా లేదు. ఇక వస్తాదులనేం తయారు చెయ్య గలం? పైగా యిదొక తక్కువ రకం హాబీ అయిపోయింది నలుగురి దృష్టిలోనూ....' అంటున్నాడింకా ఆ వ్యక్తి.

రామకోటి ఆనందంతో తల మున్కలై కళ్లు మూసుకున్నాడు. అతడు కళ్లు తెరిచేసరికి ఆ రౌండ్ పూర్తి అయింది.

* * *

అతడు యింటికి తిరిగి వెడుతూ వుండగా వెంకటేశు కనిపించాడు. అతడు నలభై అయిదేళ్ళవాడు. మనిషి సన్నగా పొడుగ్గా వుంటాడు. ఏదో ఆఫీసులో ప్యూను ఉద్యోగం చేస్తున్నాడు. జీతం తక్కువ.... పై రాబడి అసలు అవకాశం లేదు. దానికి తోడు కుచేల సంతానం. భార్య ఉత్తమురాలు. రామకోటి వారింటికి చాలా తక్కువ సార్లు వెళ్ళాడు. వెళ్ళినప్పుడల్లా 'అన్నా' అంటూ పిలిచి తమకు కలిగిన దాన్లోనే కాఫీయో, మజ్జిగో యిచ్చి పంపుతూ వుండేది. పిల్లలు మొత్తం అయిదుగురు. అందులో ముగ్గురు మగపిల్లలు. ఆడపిల్లలిద్దరూ బాగా చిన్నవాళ్ళు.

వెంకటేశు మొహం తుడుచుకుంటూ వచ్చాడు....రామకోటి అతని భుజంమీద చెయ్యివేసి 'ఏమయ్యా? ఎట్లా వున్నావు? పిల్లలు కులాసా?' అని అడిగాడు.

వెంకటేశుకు తన పిల్లలంటే ప్రేమ. అతని ముఖం ఈ ప్రశ్నతో వికసించింది. 'మా పెదవాడిప్పుడు ఫిఫ్తుఫారం చదువుతున్నాడయ్యా; క్లాసులో వాడే ఫస్టు. మరొక సంవత్సరం ఓపికపడితే తర్వాత వాడికి మా ఆఫీసరుగారు ఉద్యోగం వేయిస్తానన్నాడు.... తర్వాత వాళ్ళిద్దరినీ

బాగా పెద్ద చదువులు చదివించాలనీ మా ఆవిడ పట్టుదల... నా ఉద్దేశమూ అదే. అన్నట్టు నువ్వీ మధ్య బొత్తిగా నల్లపూసవై పోయావేం? ఏమిటి కథ?' అన్నాడు.

రామకోటి నవ్వి వూరుకున్నాడు. వెంకటేశు మళ్ళీ 'పిల్లలు 'మామ, మామ' అని గోల చేస్తున్నారయ్యా: ఒక్కసారి రాగూడదూ? ఏదో మాతోబాటు కలో గంజో తాగి కాస్సేపు ఉండిపోవచ్చు. తప్ప కుండా రా...' అంటూ సందు మలుపు తిరిగి పోయాడు.

రామకోటి నడుస్తూ ఆలోచనలో పడ్డాడు మళ్ళీ రేపు తలుచు కుంటే భయంగా వుంది. ఎట్లా గడుస్తుంది? ఏమిటి చెయ్యడం? ఎక్క డన్నా ఏదన్నా పనిలో కుదురుకుంటే బాగుండిపోను. వెంకటేశుతో ఒక్క మాట చెప్పి వుంచితే బాగుండేది. ఏ ఆఫీసులో ఏ చిన్న ఉద్యోగం దొరి కినా రోజులు వెళ్ళిపోతాయి. ఇటీవల వరకూ తనకు డబ్బు పంపించిన రాజాగారు గుర్తుకు రాగానే అతని కళ్ళు నీళ్ళతో నిండాయి. ఆయనతో ఒకప్పుడు 'నా కెక్కడన్నా చిన్న ఉద్యోగం ఇప్పించండయ్యా! చేసుకు బతుకుతాను. ఒక్కడి పొట్టకు ఎంత కావాలి? మీరు ప్రతినెలా ఊరికే డబ్బు పంపిస్తూ వుంటే తిని కూర్చోడం తప్పుగా వుంది...' అన్నాడు రామకోటి. ఆయన అది విని గంభీరంగా నవ్వి 'అదేమన్న మాట? నేను కన్నుమూసేవరకూ మా సంప్రదాయాలు యిలా సాగిపోవలసిందే. నువ్వు మొదటినుంచీ మా మనిషివి. మేము నిన్ను అభిమానించాము. చిన్నప్పటి నుంచీ నువ్వు మా నీడలో పెరిగి పెద్దవాడవై మాకు పేరు తెచ్చావు. ఏదో మాకు చేతనైనంత ఎక్కువో తక్కువో యివ్వడం మా ధర్మం— ఎక్కువ యివ్వటానికి మునుపటి రోజులు కావనుకో... ముసలి వాడివై పోయావని నిన్ను వొదిలేస్తామా?...' అన్నాడు.

ఆయన చనిపోయిన తర్వాత తన అసలు బాధ ప్రారంభమైంది. ఆకలి యింత దారుణంగా మనుష్యులను బాధించగలదని అతనికి యింతవరకూ తెలీదు.

ఎవరో అతన్ని పిలిచారు... రామకోటి ఆగాడు. వాడా పేటలో పెద్ద రౌడీ అని పేరు పొందినవాడు. కొంచెం డబ్బున్నవాడు. వాడి

ప్రయోజకత్వం రామకోటికి బాగా తెలుసు. అనవసరంగా ప్రతివారితోనూ పోట్లాట పెట్టుకోవడం, సోడాబుడ్లు పెట్టి ఎదుటివారిని కొట్టడం, పదునైన బ్లేడుతో హఠాత్తుగా అవతలివారిని గాయ పరచడం— ఇటువంటి వాటిలో ఘనుడు.

అతడు పళ్ళన్నీ బయటపడేట్టు నవ్వి 'నువ్వు పెద్ద ఫైల్మాన్‌వు కదా? నేనొక పని చెప్తాను చేస్తావా? పని సక్రమంగా చేసుకొస్తే పాతిక రూపాయ లిస్తాను' అన్నాడు.

రామకోటి తలవూపి "ఎవరినన్నా తన్ని రమ్మంటావా?" అని అడిగాడు.

వా డాశ్చర్యపోయి 'బలే ఊహించావే! సరిగ్గా అదే... చేస్తావా, మరి?' అని అడిగాడు.

రామకోటి 'చేస్తాను. నాకు మనిషిని చూపించు...' అన్నాడు.

వాడు మళ్ళీ నవ్వి 'సరే. పోదాం రా... మందు పోయించాలా?' అని అడిగాడు నడుస్తూ.

రామకోటి తల అడ్డంగా వూపి 'అక్కర్లేదు' అన్నాడు.

ఇద్దరూ దాదాపు రెండు ఫర్లాంగుల దూరం నడిచారు. అతడొక సందు మొదట్లో హఠాత్తుగా ఆగి రామకోటిని ఆపి 'అదుగో, అటు చూడు... సరిగ్గా సమయానికి వచ్చాం... వాళ్ళిద్దరూ మెట్లెక్కడంలేదూ? అదే వాళ్ళ రూము... ఆ యిద్దరిలో అవతలివాడు స్టూడెంటు.' అన్నాడు.

రామకోటి కళ్ళు నులుముకుని మరీ చూశాడు. ఆ యిద్దరినీ అతడు మరిచిపోగలడా? తాళంచెవుల గుత్తి వ్రేలితో తిప్పుతూ తన మిత్రుడితో నవ్వుతూ కబుర్లు చెబుతున్న అతని విగ్రహం స్పష్టంగా కనుపించింది. మరుక్షణంలో వాళ్ళిద్దరూ లోపలికి వెళ్ళిపోయారు.

రామకోటి పక్కకు తిరిగి 'అతనేం ద్రోహం చేశాడు నీకు?' అని అడిగాడు.

'మొన్న సినిమాహాల్లో మాటా మాటా పెరిగింది. నన్ను అందరి లోనూ కొట్టాడు.'

'నువ్వూ తిరిగి కొట్టలేకపోయావా?'

'తిరిగి కొట్టడమా?. దెబ్బ కాచుకోడం కూడా చేతకాలేదు. అదేమి చెయ్యి? అదేమి చురుకు? కరెంట్ షాక్ తగిలినట్టే...చూసేందుకు అలా వున్నాడా? చేతిచురుకు...బాబోయ్...చెప్పలేననుకో...

రామకోటి తల అడ్డంగా వూపి 'నేనేమీ చెయ్యలేను' అంటూ వెనుదిరిగాడు.

'అరె పెద్దవస్తాదువని పిలిచానే నిన్ను... ఇంతేనా సంబడం..' అన్నాడతడు వ్యంగ్యంగా.

రామకోటి 'అవును...అంతే...' అంటూ సాగిపోయాడు.

* * *

మూడురోజులైంది. రామకోటి మంచంలో పడుకుని ఆలోచిస్తున్నాడు. ఈ మూడురోజులనుంచీ అతడు కేవలం మంచినీళ్ళతోనే కాలం గడిపాడు. ఇప్పుడు పరిస్థితి అతని వశంలోలేదు. పొట్టలో మండుతున్న కొలిమి ఒకటిఉండి సెగలు పొగలు చిమ్ముతున్నట్టు అనిపిస్తున్నది.

అతడు నీరసంగా లేచాడు. రాజుగారి బొమ్మ కనిపించింది. నీళ్ళు నిండిన కళ్ళతో చేతులుజోడించి, "ఆకలి యింతభయంకరంగా వుంటుందని నాకుతెలీకుండా ఏళ్ళతరబడి పోషించావు. మళ్ళీ జన్మ అంటూవుంటే నీ ఋణం తీర్చుకుంటాను...." అనుకున్నాడు.

నెమ్మదిగా లాల్చీ తొడుక్కుని తుండు పైనవేసుకుని తలుపు దగ్గరికిలాగి యివతలకి వచ్చాడు. గుడ్డివెన్నెల...ఒకదానిమీద ఒకటి కట్టినట్టున్న పాకలు...వాటిముందు బొంతలూ, చాపలూ, కుక్కిమంచాలూ వేసుకుని పడుకున్న పేదలు...కొంచెందూరంలో చెట్లక్రింద ఆమాత్రపు వసతులుకూడా లేని దేశద్రిమ్మరులు...వీరంతా ఏం తింటున్నారు? ఎలా సంపాయిస్తున్నారు?

అతడు నీరసంగా నడిచివెళ్ళి ఒకడాబా యింటిముందాగాడు. అది కుస్తీల కంట్రాక్టరు యిల్లు —పిలుపువిని ఒక కుర్రవాడువచ్చి "మా నాన్నగారికోసమా? లోపలికిరా.." అన్నాడు.

పంచలో వాలుకుర్చీలో కూర్చుని పేపరు చూస్తున్నాడాయన. రామకోటి నమస్కరించి పంచమెట్టుమీద కూర్చున్నాడు ఆయన 'ఏం కావాలి?' అన్నట్టు చూశాడు.

'నా పేరు రామకోటి... మీరు వినేవుంటారండి... దేశమంతటా ఎన్నోచోట్ల పెద్దపెద్ద వాళ్ళతో పోటీచేసి 'సెభాస్' అనిపించుకున్నాను. మా రాజుగారికి నేనంటే అభిమానం... ఇప్పటిదాకా ఆయనే నన్ను పోషించారు. ఇటీవలే ఆయనపోయారు. కొంచెం బాధల్లో వున్నాను..." అన్నాడు రామకోటి.

'అయితే ఏంచెయ్యమంటావు?' అని అడిగాడాయన.

రామకోటి నెమ్మదిగా "వచ్చే ఆదివారంనాడు నాకొక ఛాన్సు ఇప్పించండి. నేనూ గోదాలోకి దిగుతాను—అవతలివాళ్ళకెంత యిస్తారో నాకూ అంతే యివ్వండి..." అన్నాడు.

ఆయన కళ్ళు చిన్నవిచేసి నిశితంగాచూసి హఠాత్తుగా "ముసలాడివి నీకెందుకులేవయ్యా. ప్రమాదవశాత్తు ఏ కాలో చెయ్యో విరిగినా ఆ ఉసురు నాకు చుట్టుకుంటుంది. అవతల వాళ్ళంతా రాక్షసులు... శివమెత్తినట్టు గోదా అంతటినీ దున్నుతున్నారు. ఆ రోజులుకావు యివి...ఒక్కొక్కడూ నిన్ను నంజుకు తింటాడు ఏమనుకున్నావో. దుస్సాహసం పనికిరాదు... అంత యిబ్బందిగా వుంటే రేపొకపూట మా యింటికిరా అన్నం తిని పోదువుగాని..." అంటూ మళ్ళీ పేపరు చూడటం ప్రారంభించాడు.

రామకోటికి నవ్వొచ్చింది. ఆ రోజులుకావు నిజమే... అయినా గోదా అంతటినీ దున్నడం గురించీ, నంజుకుతినడం గురించీ ఆయన అన్న మాటలు యదార్థాలు కావు. తనకు తెలుసు వాళ్ళ పరాక్రమం ఎటువంటిదో: అతడు నీరసం వల్ల ఒక్క క్షణం నిశ్శబ్దంగా ఊరుకుని తర్వాత లేచి "సెలవు బాబూ!" అని చెప్పి బయటికి వచ్చాడు.

వీధిలోకి రాగానే నిస్సత్తువ అతన్ని ఆవహించింది. ఉన్నట్టుండి కాళ్ళు తడబడ్డాయి. వొళ్ళు తూలింది. ఎవరో తనను పిలుస్తున్న సవ్వడి.. వెనుదిరిగిచూస్తే ఎవరూలేరు.

అతడు కాళ్ళీడ్చుకుంటూ మరికొంత దూరం నడిచి వెంకటేశు యింటిముందు నిలబడ్డాడు. వాళ్ళింట్లో యిప్పుడు అన్నం వుంటుందా? వెంకటేశు సంపాదన తనకు తెలియనిది కాదు. ఇప్పుడువెడితే యిబ్బంది పెట్టడం అవుతుందేమో!

అంతలో వెంకటేశు బయటికి తొంగిచూసి 'ఎవరది?' అంటూ యివతలికివచ్చి అతన్ని గుర్తించి "నువ్వేనా రామకోటీ! అలా నిలబడి పోయావేం? రా లోపలికి. సరిగా సమయానికి వచ్చావు. మీ చెల్లెలు అందరికీ అన్నాలు పెడుతున్నది. ఇంతసేపూ పిల్లలు చదువుకుంటూ కూర్చున్నారు. అందుకని ఇవాళ ఆలస్యమైంది..." అంటూ అతన్ని లోపలికి తీసుకుపోయాడు.

లోపల పిల్లలందరూ పింగాణి కంచాలముందు కూర్చునివున్నారు. ఆఖరి పిల్లవాడు రామకోటిని చూసి వెలుగుకుమ్మరిస్తూ నవ్వాడు వెంకటేశు భార్య తలఎత్తి చూసి "నువ్వా అన్నా! రా, శాన్నాళ్ళకు వచ్చావు. మమ్మల్ని బొత్తిగా మర్చిపోయావిన్నాళ్ళూ..." అన్నది. వేరే విస్తరి వేస్తూ.

రామకోటి కళ్ళముందు మచ్చలు కదులుతున్నాయి. అతడు ఏమీ బదులు చెప్పకుండా విస్తరిముందు వెళ్ళి కూర్చోవడం చూసి భార్యాభర్తలు ఒకరిముఖం ఒకరు చూసుకున్నారు. అంతలోనే వెంకటేశు భార్య గిన్నెలో మిగిలిన అన్నమంతా విస్తరిలోపెట్టి ఆధరువేదో వేసి "అన్నా...కానివ్వు" అన్నది. వెంకటేశు అతని వక్కనే కూర్చున్నాడు.

రామకోటి త్వరత్వరగా నాలుగు ముద్దలు మింగి నీళ్ళుతాగి ఈ ప్రపంచంలోకి వచ్చాడు. తర్వాత మిగిలిన అన్నం తింటూ పిల్లలందరినీ పలకరించాడు. వెంకటేశుభార్యతో "ఉన్న అన్నమంతా నాకే పెట్టేశావు. నువ్వేం తింటావు చెల్లెమ్మా" అన్నాడు. ఆమె నవ్వుతూ "మళ్ళీ కుంపటి మీద బియ్యం కడిగిపెడితే ఎంతసేపు...క్షణంలో కాదూ..." అన్నది.

రామకోటి చెయ్యికడుక్కుని "నాక్కూడా ఎక్కడన్నా చిన్న ఉద్యోగం చూసిపెట్టవయ్యా..." అన్నాడు. వెంకటేశు బీడీయిస్తూ ఆ

మాటవిని నవ్వాడు. రామకోటి కూర్చుని బీడీ ముట్టించుకోబోతూ ఆగి హఠాత్తుగా "ఎవరో పిలుస్తున్నారయ్యానన్ను...." అన్నాడు. వెంకటేశు వాకిట్లోకివచ్చి "ఎవరూలేరే' అన్నాడు. రామకోటి కలవరిస్తున్నవాడిలా "అదే మా రాజుగారి గొంతు...." అన్నాడు. తర్వాత బీడీ ముట్టించుకున్నాడు.

కొద్ది నిమిషాల తరువాత లేచి 'వెళ్ళొస్తాను చెల్లెమ్మా' అని కేక వేసి పిల్లలందర్నీ మళ్ళీ పలకరించి వెంకటేశుతో 'నాఉద్యోగం సంగతి మర్చిపోకయ్యా' అని హెచ్చరించి వీధిలోనికివచ్చాడు. బాగా పొద్దుపోయినట్టున్నది. ఎక్కడో ఏదో పక్షి ఒకటి వుండివుండి విచిత్రంగా అరుస్తున్నది. ఒక పాకలో పసిపిల్లవాడెవడో గుక్క తిప్పుకోకుండా ఏడుస్తున్నాడు.

రామకోటి తన కుక్కి మంచంలో పడుకున్నాడు. ఆకలి తగ్గింది. కాని, కళ్లముందు రంగు రంగుల చక్రాలు కదలడం వింతగా వున్నది. గదిలోకి గాలి విసురుగా వీస్తున్నది. గాలిలో కలిసిన ఏదో గొంతు తనను పిలిచినట్టయింది. ఎవరు పిలుస్తున్నారో చూద్దామని అతడు లేవపోయాడు. కాని లేవలేదు. అతని కళ్ళు తెరుచుకుని ఉండిపోయాడు.

*   *   *   *

చూపుడు వ్రేలుతో తాళం చెవుల గుత్తి గిరగిరా తిప్పుతూ ఆ యువకుడూ, మాటిమాటికీ ముఖం తుడుచుకుంటూ అతని మిత్రుడూ కాలేజీకి వెడుతుండగా వీధిలో రోడ్డు ప్రక్కన ఒక దృశ్యం...

ఒక నడివయసు మనిషి ముగ్గురు చిన్నపిల్లలూ వీధిలో వెళ్ళే వారిని ఆపి అనాధప్రేతంబాబూ; ఎవరూలేరతనికి' అంటూ డబ్బులు అడుగుతున్నాడు. తోచిన వారు తోచినంత పడేసి వెళ్ళిపోతున్నారు. ప్రక్కనే శవం పడుకోపెట్టబడి వుంది. శవం తల నుంచి కాళ్ళవరకూ గుడ్డ కప్పి వుంచారు.

ఆ యువకుడు అటువైపు నడిచాడు. అతని మిత్రుడు 'ఎందుకురా

నీకివన్నీ ? అన్నీ యిటువంటి అనవసరపు పనులే చేస్తుంటావు. అందుకే తలనొప్పి నీతో' అంటూనే అతని వెనక వచ్చాడు.

ఆ యువకుడు ఒక అర్ధ రూపాయ నాణెం తీసి ఆ నడివయసు మనిషి చేతికిచ్చి శవం వైపు చూశాడు.

హఠాత్తుగా గాలి విసురుకు శవం ముఖంమీది గుడ్డ తొలిగింది. ఆ యువకుడు తన మిత్రుడి చెయ్యిపట్టుకుని 'అరె! మొన్న హోటల్లో మనతో పందెంకట్టి ఇడ్లీతినలేదూ, అతనే..." అన్నాడు. అతని మిత్రుడు కూడా ఒకసారి అటుచూసి 'అవును. అయినా యిక వచ్చెయ్యి నువ్వు అవతల కాలేజి టైమవుతున్నది...' అంటూ అతని చెయ్యి పట్టుకుని లాక్కుపోయాడు.

ఆ నడివయసు మనిషి, శవం ముఖం మీది గుడ్డను సరిచేశాడు.